# సెర్బియా : విద్యాలయ ప్రాంగణాల నుండి వీధులలోకి పోటెత్తిన విద్యార్థుల తిరుగుబాటు

**సెర్బియా** అధ్యక్షుడు అలెక్సాండర్ దశాబ్దకాల పాలన పునాదులను ప్రజానిరసనల అలలు కుదిపివేశాయి. ఒక విషాదకర విపత్తుకు ప్రజా సంతాపంతో మొదలైన ఈ ఆందోళన, ఈ సంవత్సరాలలో దేశ నాయకత్వానికి అత్యంత గణనీయమైన సవాల్‌గా పరివర్తన చెందింది. విద్యార్థులు, రాజకీయంగా దూరంగా వున్నట్లుగా ఒకనాడు కనిపించినవారు, ఈ చారిత్రక ఉద్యమం వెనుక చోదకశక్తిగా ఎదిగి, నిర్బంధాన్ని నిరసించటంతోపాటు సమాజంలోని విశాల విభాగాల ప్రజానీకాన్ని, న్యాయం కోసం జవాబుదారీతనం కోసం సాగించే తమ పోరాటంలోకి సమీకరించారు.

2024 నవంబర్ ఒకటవ తేదీన నోవీసాద్‌లోని రైల్వేస్టేషన్ పైకప్పు కూలిపోయిన ఘటనలో 15 మంది ప్రజలు మరణించటంతో నిరసనలు పెల్లుబికాయి. 2023 ప్రారంభంలో ప్రజావిద్యాలయంలో కాల్పుల నుండి ప్రారంభమై, అవినీతి, ఆశ్రిత పక్షపాతాల విపరిణామాలతో సెర్బియా ప్రజానీకం మరోసారి సంఘర్షణ పడుతూ వచ్చారు. మౌలిక వసతుల కల్పనలో భద్రతకు హామీ కల్పించని ప్రభుత్వ వైఫల్యానికి వ్యతిరేకంగా ప్రజలు కోపోద్రిక్తులయ్యారు. అయితే విద్యార్థులపై దాడి ఘటనతో, విషాదం నుండి కార్యాచరణకు పూనుకున్నారు. నవంబర్ 22న, పాలకుల అనుబంధ గూండాలు విద్యార్థులపైన, అధ్యాపక బృందంపైన దాడి చేశారు. యూనివర్శిటీ ఆఫ్ బెల్‌గ్రేడ్‌లోని నాటక, కళా విభాగ అధ్యాపక బృందం, మృతులను స్మరించుకునేందుకు సమీకృతులై వుండగా, వారిపై దాడికి పాల్పడ్డారు. ఈ ఘటన ఒక క్రియాశీల పాత్ర నిర్వహించి, దేశవ్యాపితంగా విద్యార్థుల నాయకత్వంలో ప్రదర్శనలు, ధర్నాలు నిర్వహించటానికి తోడ్పడింది.

రైల్వేస్టేషన్ పునర్నిర్మాణంపై పారదర్శకతను డిమాండ్ చేస్తూ ప్రారంభమైన ఈ ఉద్యమం, త్వరితంగా విస్తరించింది. అరెస్టు చేసిన ఆందోళనాకారులను పోలీసులు విడుదల చేయాలని విద్యార్థులు పిలుపునిచ్చారు. అలాగే హింసకు కారకులైన అధికారులపై విచారణ చేపట్టాలని, విద్యార్థుల ఫీజలను తగ్గించాలని వారు డిమాండ్ చేశారు. నిరసనలు వెనువెంటనే విశ్వవిద్యాలయ ప్రాంగణాలను దాటి వ్యాపించాయి. విద్యాలయ ఉపాధ్యాయులు, రవాణా కార్మికులు, గనికార్మికులు, రైతులు సంఘీభావంగా ఉద్యమంలో చేరారు. రహదారుల దిగ్బంధనమనేది, ఓ సాధారణ ఎత్తుగడగా అయింది. 2024 డిసెంబర్ చివరలో, బెల్‌గ్రేడ్ వీధులలో లక్షమంది ప్రజలు చాలా భారీ ప్రదర్శన నిర్వహించారు. 2000 సం॥లో స్లోబోడాన్ ప్రభుత్వాన్ని కూల్చివేసిన తర్వాత నిర్వహించిన పెద్ద ప్రదర్శన ఇది.

ఈ తిరుగుబాటును నిలువరించటం కోసం ప్రభుత్వం సంఘర్షణకు దిగింది. నిర్బంధాన్ని తీవ్రం చేసింది. విద్యార్థులు క్రూరమైన దాడులకు గురయ్యారు. ప్రదర్శనకారులపై వాహనాలతో దాడులు జరిపారు. ప్రభుత్వ అనుబంధ సమూహాలు ఆందోళనకారులపై దాడులకు పాల్పడింది. అయినప్పటికీ, రాజ్యహింసలో భాగంగా ప్రయోగిస్తున్న ప్రతి ఒక్క చర్య, ప్రజాగ్రహాన్ని మరింతగా పెంచి, ఉద్యమాన్ని బలీయం చేసింది.

2025 జనవరి 31న శక్తివంతమైన ఉద్యమం ముందుకు వచ్చింది. వేలాది మంది విద్యార్థులు బెల్‌గ్రేడ్ నుండి నోవిసాద్ వరకు 80 కిలోమీటర్ల దూరం కవాతు నిర్వహించారు. ఈ కవాతు పొడవునా ప్రజలు ఎంతో ఉత్సాహభరితంగా వీరికి మద్దతుగా నిలిచారు. ఈ దారి మార్గంలో ప్రజలు ఆందోళనకారులకు ఆహారం, బస మొదలైన సౌకర్యాలను కల్పించారు. విద్యార్థులు రాజధాని నుండి తిరిగివెళ్ళే క్రమంలో టాక్సీ డ్రైవర్లు ఉచితంగా సేవలు అందించారు. కార్మికవర్గ సమూహాలు, విద్యార్థుల వెనుక సమీకృతమయ్యారు.

ఈ ప్రజాసమీకరణలు జరుగుతుండగానే, అధికారాన్ని అంటిపెట్టుకుని వుండేందుకోసం, విదేశీదన్నుతో జరుగుతున్న కుట్రపూరిత నిరసనలుగా అధ్యక్షుడు వీటిని కొట్టిపారేశాడు. పారదర్శకంగా వుండాలనే డిమాండ్‌ను ప్రాథమిక దశలో ఆయన తిరస్కరించినా, తర్వాత విద్యా నిధులను పెంపుచేయటం, నిర్దిష్ట డాక్యుమెంట్లను విడుదల చేయటం వంటి చర్యలను ప్రభుత్వం ప్రకటించింది.

ఏమైనా, ఈ చర్యలు ఉపరితలమైనవిగా, స్వతంత్ర నిపుణులు కొట్టిపారేశారు. ఈ మధ్యలో ఇయు, అమెరికా, రష్యా, చైనా వంటి అంతర్జాతీయ దేశాలు, అంతర్జాతీయ ఉద్రిక్తతలు పెరుగుతున్న పరిస్థితుల నడుమ బాల్కన్ దీవులలో అస్థిరత పట్ల భయపడి ప్రెసిడెంట్ అలగ్జాండర్‌కు అధిక సంఖ్యలో దన్నుగా నిలిచారు.

అయినప్పటికీ సెర్బియా లోపల, ప్రాథమికంగా కొంత మార్పు జరిగిందనేది స్పష్టం. లోతైన, దేశ ఆర్థిక, సామాజిక బాధల గాధలను ఈ నిరసనలు పూర్తిగా వెల్లడిచేశాయి. పెరుగుతున్న జీవన వ్యయం నుండి విస్తృతంగా వ్యాపించిన ప్రభుత్వ పక్షపాతమనేదాని వరకు ఈ నిరసనలు వెల్లడిచేశాయి. ఇప్పటికీ అలెగ్జాండర్ ఎన్నికల రాజకీయాలపై ఆధిపత్యం చేస్తూండగా, వీధులలో అతని పట్టు సడలి పోతోంది. నిరసనాందోళనలు తగ్గిపోకుండా కొనసాగిస్తూ, స్వతంత్రంగా సంఘటితం గావటం అనేవి కీలకమైనవి. అంతర్జాతీయ నిరసన ఉద్యమాలనుండి స్ఫూర్తిని స్వీకరించి, విద్యార్థులు విశాల పోరాటాలను తిరిగి శక్తివంతం చేసుకోవాలి. కార్మికహక్కులతో సహా పర్యావరణ సమస్యలను డిమాండుగా, వారు తమ విశాల పోరాటాలను శక్తివంతం చేసుకోవాలి. సమీప భవిష్యత్తులో అలెగ్జాండర్ ప్రభుత్వం కూలిపోయినా, కూలిపోకపోయినా విద్యార్థుల నాయకత్వంలోని నిరసనలు, అనివార్యంగా సెర్బియా రాజకీయ చిత్రపటాన్ని మార్చి వేస్తాయి.

*****